క్లుప్తంగా

నేడు పేటలో వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చిల్లకల్లు రోడ్డులోని శుభ మస్తు ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమ నిర్వహణపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనాయకులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఏకాదశి పూజలు



వత్సవాయి: తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే ఆలయాలకు చేరుకుని ప్రత్యేకపూజలు చేశారు. చిట్టేలలోని శ్రీశ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆషాడమాస ఆదివారం నేపథ్యంలో మంగొల్లులోని పెద్దమ్మ తల్లికి ఆషాడమాస బోనాలను సమర్పించారు. డప్పువాయిద్యాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామాయణ పురాణ ప్రవచనం



నందిగామరూరల్: స్థానిక శతవార్షిక ముక్కోటి మహామండపంలో శ్రీమద్రామాయణ పురాణ ప్రవచన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మల్లాది వెంకటరామనాథశర్మ మాట్లాడుతూ రామాయణ మహాగ్రంథం ఎంతో విశిష్టమైనదన్నారు. కుటుంబ బాంధవ్యాలు, ప్రవర్తనా నియమాలను రామాయణం చక్కగా వివరిస్తోందన్నారు. 24వేల శ్లోకాలతో కూడిన రామాయణం దేశంలోని హిందూధర్మం చరిత్ర, సంస్కృతి, నడవడిక, నమ్మకాలు, ఆచారాలపై అనితరమైన ప్రభావం చూపుతుందని తెలిపారు. పురాణ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 14 వరకు రోజూ ఉదయం, సాయంత్రం పురాణ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని ముక్కోటి మహోత్సవ ఉత్సవ కమిటీ దివి వెంకట రత్నమాచార్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

వీరులపాడు: ముస్లింలు పదిరోజులపాటు జరుపుకునే మొహరం పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మేళతాళాల నడుమ విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను ఆదివారం ఊరేగించారు. ఇళ్ల ముందుకు వచ్చిన పీర్లకు ప్రజలు స్వాగతం పలికి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో ముస్లింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ పేట కార్యదర్శిగా శివాజీ ఎన్నిక




జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ సీపీఐ కమిటీకి 13మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా అంబోజి శివాజి, సహాయ కార్యదర్శులుగా కనకపూడి బాబురావు, పోతిపాక వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు, నీలకంఠం శివప్రసాద్, వల్లంకొండ బ్రహ్మం, పొన్నం నరసింహారావు, పద్మాల వెంకటేశ్వర్లు, కటారపు కన్నయ్య, గొర్రెపాటి కుమారి, మెటికల శ్రీనివాసరావు, కరిసె మధు, షేక్ జాని ఎన్నికయ్యారు.



శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శాకంబరీ అలంకరణలో శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవార్ల ఉత్సవమూర్తులు



శాకంబరీ అలంకరణలో ఊరు అంకమ్మవారు

శాకాంబరీగా దర్శనమిచ్చిన అమ్మవారు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారు ఆదివారం శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారితో పాటు సహదేవతల ఉపాలయాలు, ఆలయ పరిసరాలను వివిధరకాల శాకములు(కూరగాయలు), ఆకుకూరలు, పండ్లుతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కరువు కాటకాలు లేకుండా, పాడిపంటలతో వర్ధిల్లేలా తమను దీవించాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. దోసకాయలు, సొరకాయలు, వంకాయలు, కాకార, బీర, పొట్ల, బెండకాయ, పుచ్చకాయ, బంగాళదుంప తదితర కూరగాయలతోపాటు ఆకుకూరలు, పండ్లతో చేసిన అలంకరణ ప్రత్యేకాకర్షణగా నిలిచింది.కార్యక్రమంలో భాగంగా చండీ హోమం నిర్వహించగా, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, ఈఈ ఎల్ రమ, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. భక్తులకు ప్రత్యేకంగా కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను అమ్మవారిని దర్శించుకున్నారు.



చండీహోమంలో పాల్గొన్న ఈవో కిషోర్‌కుమార్ దంపతులు, ఈఈ రమ



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ



ఆలయ ఆవరణలో బోనాలతో భక్తుల సందడి

టీకాల కార్యక్రమం ప్రారంభం



నందిగామరూరల్: పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి సూచించారు. ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం భాగంగా పట్టణంలో నిర్వహించిన ఉచి రాబీస్ వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి పలురకాల అంటువ్యాధుల ప్రబలే అవకాశం ఉందన్నారు. టీకాలు వేయిస్తే వాటి నుంచి మనషులకు అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని వివరించారు. మొత్తం 64 కుక్కలకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేసినట్లు పశు సంవర్ధక శాఖ డీడీ మోజేస్ వెస్లీ తెలిపారు. కార్యక్రమంలో ఏడీ బత్తుల వెంకట్రావ్, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామటౌన్: నేరచరిత్ర కలిగినవారు తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని నందిగామ సీఐ వైవిఎల్ నాయుడు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



నందిగామ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

నందిగామటౌన్: కరువు సమయంలో దేశంలో ఆహార సంక్షోభాన్ని నివారించేందుకు కేంద్ర వ్యవసాయశాఖా మంత్రిగా బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన కృషి అనిర్వచనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి, గాంధీ సెంటరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ హరిత విప్లవంతోపాటు భారత వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంలో విశేష కృషి చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ వేత్తగా జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, జడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, చిలుకూరి బుచ్చిరెడ్డి, ఉలవలపూడి నరేంద్ర, షేక్ మున్నా, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి...

నందిగామ రూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నివాళి..

నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించి, ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ సైదా, పెసరమల్లి సురేష్, షేక్ దాదాహుసేన్, యరగొర్ల రామారావు, ముళ్లపాటి అశోక్ పాల్గొన్నారు.

అసమానతలు రూపు మాపేందుకు కృషి...

జగ్గయ్యపేటఅర్బన్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ఎస్సీసెల్ నాయకులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఉపప్రధానిగా, దళిత నాయకుడిగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, నోడల్ ఏజెన్సీ కోసం జగ్జీవన్‌రామ్ విశేషంగా కృషిచేశారన్నారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజలను దగా చేసిందని, కక్షపూరితమైన పాలనతో ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తోందన్నారు. దుర్మార్గమైన కూటమి పాలనను ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకర్, జిల్లా కార్యదర్శి రూప్లానాయక్, ఎంపీపీ కొలుసు రమాదేవి తిరుపతిరావు, నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు శ్యామల, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు రాజు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు పిడమర్తి ప్రభు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేషగిరిరావు, మండల ఉపాధ్యక్షుడు మెట్టు ఏడుకొండలు, సర్పంచ్ సూరిబాబు, తిరుమలగిరి గ్రామ అధ్యక్షుడు ఇశ్రాయేలు,నాయకులు మెట్టుకోలు నరేష్, షేక్ బాజీ, షేక్ ఖాదర్, ఇమ్రాన్‌పాషా, ఉప్పెల్లి పెంటయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

నివాళులర్పించిన ఎమ్మెల్యే...

జగ్గయ్యపేట అర్బన్: మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనలో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే తాతయ్య, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. టీడీపీ కూటమి నాయకులు, ఎస్సీసెల్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్థానిక బస్టాండ్ వద్ద నున్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఈమని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: భారత మాజీ ఉపప్రదాని బాబు జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని పెద్దాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్ బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, సొసైటీ మాజీ చైర్మన్ ఆవుల ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంశీకి జగన్‌మోహనరావు పరామర్శ



వల్లభనేని వంశీని పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. తేలప్రోలు గ్రామంలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఆదివారం ఆయన పరామర్శించారు. వంశీ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వంశీపై అక్రమంగా కేసులు పెట్టి 140 రోజులు రిమాండ్‌లో ఉంచడం బాధాకరమన్నారు. నిష్పక్షపాతంగా పని చేయాల్సిన పోలీసులు సైతం కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహ్మద్ మస్తాన్, గాదెల వెంకటేశ్వరరావు, ఆకుల హనుమంతరావు, రామిరెడ్డి సీతయ్య, గుదే అక్కారావు, సీహెచ్ రవికిరణ్‌రెడ్డి, స్టాలిన్ పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



వేదాద్రిలో స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జగ్గయ్యపేట: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి, వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల ఈవోలు సాంబశివరావు, సురేష్‌బాబు అన్ని ఏర్పాట్లు చేశారు. నరసింహ స్వామి వారిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దర్శించుకుని పూజలు చేశారు. తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పూజలు చేశారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి, అభయ వీరాంజనేయస్వామి, లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాలలో అర్చకులు స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ముందుగా స్వామివార్లకు పుష్ప, తులసీ అర్చనాది పూజలు నిర్వహించగా వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

శ్రీవిష్ణు సహస్ర పారాయణం..

జగ్గయ్యపేటఅర్బన్: తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో చౌడవరపు కుటుంబీకుల ఆధ్వర్యంలో సామూహిక శ్రీవిష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. పెద్ద రామాలయంలో తిరువాయి మొజీ సేవాకాలం నిర్వహించారు.

ప్రాజెక్టును ఆధునీకరించాలని డిమాండ్

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గంలోని వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేటిపై నిర్మించిన పోలంపల్లి ప్రాజెక్టును ఆధునీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరందించే పోలంపల్లి ప్రాజెక్టును ఆధునీకరించడంతోపాటు వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని కూడా మరమ్మతులు చేసి రైతులకు సకాలంలో సాగునీరందించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన కార్మిక సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా 13 రకాల పథకాలను అమలుచేసేవారని, నేడు ఆ పరిస్థితి లేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించి కార్మికులకు న్యాయంగా అందాల్సిన 13 రకాల పథకాలను వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చెవిలో పువ్వు.. చేతిలో ప్లేట్లతో వినూత్న నిరసన



'చెవిలో పువ్వు.. చేతిలో ప్లేట్లతో తమ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న కార్మికుల ఆందోళన కార్యక్రమం రెండోరోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా కార్మికులు ' చెవిలో పువ్వు.. చేతిలో ప్లేటు పట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జీవో నెంబరు 36 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ఆందోళనకు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మద్దతు పలికారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కందెల శ్రీను, దారెల్లి అశోక్, వంశీ, రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



జగ్గయ్యపేట అర్బన్: వత్సవాయి–వైరా రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వత్సవాయి గ్రామానికి చెందిన చల్లా వేణు మృతదేహాన్ని జగ్గయ్యపేట ఆస్పత్రి వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. అతని కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించినవారిలో వైఎస్సార్ సీపీ వత్సవాయి మండల అధ్యక్షుడు గుత్తా శంకర్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి తిరుపతిరావు, పేట పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, మెట్టుకోలు నరేష్, శ్రీధర్, షేక్ బాజీ ఉన్నారు.